



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి శనివారం 21-03-2026 సంపుటి: 01 సంచిక : 275 వేల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Saturday 21-03-2026 Volume :01 Issue: 275 Cost: 2 Pages:08 Editor : Katta HimaPavani






Contact Number
9059328777


# రూ.3,24,234 కోట్లతో

# రాష్ట్ర బడ్జెట్

**ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు**

**1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా**

ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథకం.. రూ.14,861 కోట్లు, రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు



Life Insurance






- జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయింపు
- విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయింపు
- వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు
- విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు
- పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు
- పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు
- విద్యా శాఖకు రూ.26,674 కోట్లు
- వైద్య శాఖకు రూ.13,679 కోట్లు
- కార్మిక శాఖకు రూ.998 కోట్లు
- మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు
- ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు,
- ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు
- బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు
- మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు
- ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు
- యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు
- మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు
- మహాలక్ష్మి పథకం.. రూ.4,305 కోట్లు
- అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,

తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-27 తెలంగాణ బ్జడెట్‌లో 'ప్రజా క్షేమం సామాజిక న్యాయం' అనే నినాదంతో ముందుకు సాగింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌలిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని

-మిగతా 2 లో

| బడ్జెట్ (రూ. కోట్లలో) | రెవెన్యూ వ్యయం | మూలధన వ్యయం |
| --- | --- | --- |
| 3,24,234 | 2,34,406 | 47,267 |



## పిరికిపందలు.. మిమ్మల్ని గుర్తు పెట్టుకుంటాం..!

- అమెరికా సహాయం లేకపోతే నాటో ఒక 'కాగితపు పులి'
- వందల బిలియన్ల ఖర్చు.. బదులుగా శూన్యం
- నాటోపై ట్రంప్ నిప్పులు:

న్యూఢిల్లీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి నాటో సభ్య దేశాలపై మండిపడ్డారు. ఇరాన్ దాడుల నేపథ్యంలో హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడానికి తమతో కలిసి రానందుకు నాటోను ఒకే వైపున్న వీధిగా అభివర్ణించిన ట్రంప్.. ఈసారి పిరికిపందలుగా పేర్కొన్నారు. శుక్రవారం తన సోషల్ మీడియా పోస్టుల్లో పిరికిపందలారా.. మిమ్మల్ని గుర్తు పెట్టుకుంటాం అని నాటో దేశాలపై ట్రంప్ తన అక్కసు వెళ్లగక్కారు.ఇజ్రాయేల్‌తో కలిసి ఇరాన్‌పై యుద్ధానికి దిగిన డొనాల్డ్ ట్రంప్‌నకు ప్రపంచ దేశాల నుంచి మద్దతు కరువవుతోంది. అంతర్జాతీయ జల రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడంలో నాటో దేశాల సాయం కోరిన అమెరికా అధ్యక్షుడికి చుక్కెదురైంది. ఇరాన్‌పై చేస్తున్న యుద్ధంలో తాము పాల్గొనబోమని ఆయా దేశాలు స్పష్టం చేశాయి. దాంతో, చిర్రెత్తుకొచ్చిన ట్రంప్ మాకు ఎవరి సాయం అక్కర్లేదు అని నాటో దేశాలకు తేల్చి చెప్పారు. చమురు ధరలు పెరుగడంపై ఆందోళన

-మిగతా 2 లో

### ఫోన్ ట్యాపింగ్‌పై చట్టప్రకారమే

# ముందుకు

**హరీస్ రావుకు ట్యాపింగ్‌లో ఊరట అబద్ధం**


- పదో తరగతి పరక్షలు లేకుండా 12 తరగతులు
- తెలంగాణ విద్యారంగంలో కీలక మార్పులకు కసరత్తులు
- కమిటీ అధ్యయనం తరవాత విస్తృతస్థాయిలో ప్రజాభిప్రాయం
- మేం వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పులు చేశాం
- రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం అప్పులకు చెల్లించాం
- కెసిఆర్‌ను గృహనిర్బంధం చేసిన కేటీఆర్, హరీష్ రావు
- హిల్టు టీడీఆర్ భూ బదలాయింపులపై ఎలాంటి విచారణకైనా సిద్ధం
- డ్రగ్స్‌పై నోరుమెదపని బిజెపి, బిఆర్ఎస్ నేతలు
- మీడియతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ విషయంలో చట్టప్రకారమే ముందుకు వెళు
న్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కేసులో కీలక నిందితుడు ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో దర్యాప్తు 20 నెలలు ఆలస్యమైందన్నారు. ఇందులో అరెస్టలు తప్పవని కూడా అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ దొరికినా.. భాజపా నేతలు మాట్లాడటం లేదని, బీఆర్ఎస్, భాజపా కలిసి ఉన్నారనేందుకు ఇదే నిదర్శనమని చెప్పారు.

-మిగతా 2 లో




### ఆరు గ్యారెంటీలకు

## సమాధి కట్టారు

- బడ్జెట్ కేటాయింపులు అధ్వాన్నం
- మహిళల పెన్షన్‌పై మాట్లాడని బడ్జెట్
- పేదలపట్ల చిత్తశుద్ధి లేని బడ్జెట్ ఇది
- భట్టి కేటాయింపులపై హరీష్ రావు పెదవివిరుపు

హైదరాబాద్


తెలంగాణ బడ్జెట్‌పై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు పెదవి విరిచారు. ఇదొక ఝూటా బ్జడెట్ అని, బోగస్ బడ్జెట్ అని ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్‌తో ప్రభుత్వం అన్ని వర్గాల వారిని మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలను, ఆర్టీసీ కార్మికుల సమస్యలను, నిరుద్యోగల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చిన పించన్ పెంపు హామీలను కూడా సర్కారు మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు రూ.

-మిగతా 2 లో

### ఇంటి పని, వంట పని

## చేయకపోతే క్రూరత్వం కాదు..

- పెళ్లి చేసుకునేది పనులు చేయించుకోవడానికి కాదు, భాగస్వామి కోసం.
- భర్తలు కూడా వంట, ఇంటి పనుల్లో సాయపడాలి.
- భార్య ఇంటి పనుల విషయంలో సుప్రీంకోర్టు వ్యాఖ్య



న్యూఢిల్లీ

భార్య ఇంటి పని, వంట పని చేయనంత మాత్రాన అది క్రూరత్వం కిందకు రాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అంతేకాదు ఒక మహిళను పెళ్లి చేసుకునేది పనులు చేయడం కోసం మాత్రమే కాదని అభిప్రాయపడింది. జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ విక్రమ్ నాథ్ ఆధ్వర్యంలోని సుప్రీం ధర్మాసనం ఈ కేసును విచారించి, తాజా వ్యాఖ్యలు చేసింది. తన భార్య ఇంటి పనులు చేయడం లేదని, తనను, కుటుంబ సభ్యుల్ని చూసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తోందని, ఈ నేపథ్యంలో ఆమె నుంచి విడాకులు కావాలని కోరుతూ ఒక వ్యక్తి ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించాడు.కేసు వివరాలకు సంబంధించి.. ఒక జంట 2017లో పెళ్లి చేసుకున్నారు. వారికి ఎనిమిదేళ్ల కుమారుడు కూడా ఉన్నాడు.

-మిగతా 2 లో

## బడ్జెట్‌లో ఆర్భాటపు అంకెలు...ప్రగల్భాలు



- అప్పులకోసం చేసే ప్రయత్నాలే ఎక్కువ
- బడ్జెట్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

హైదరాబాద్,


అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలే తప్ప బడ్జెట్‌లో ఒరిగిందేమీ లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదాయాన్ని పండబెట్టి.. అప్పుల కోసం అర్రులు చాచే బ్జడెట్ ఇది అంటూ

-మిగతా 2 లో

### జాబ్ ఫస్ట్ అనేది

## కూటమి లక్ష్యం

- 20లక్షల ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నాం
- ఏపీపీఎస్సీ ద్వారా 10,060 ఉద్యోగాలు భర్తీ
- మే 15 నుంచి అక్టోబరు వరకు వివిధ నోటిఫికేషన్లు
- ఉగాది ఉత్సవాల్లో సీఎం చంద్రబాబు వెల్లడి



అమరావతి

ఏటా ఉగాది రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ నెరవేరుస్తామని అన్నారు.ఏపీపీఎస్సీ ద్వారా 10,060 ఉద్యోగాలు భర్తీచేసేందుకు ఈసారి జాబ్ క్యాలెండర్ విడుదల చేసినట్లు ఆయన ప్రకటించారు. మే 15 నుంచి అక్టోబరు వరకు వివిధ నోటిఫికేషన్ల ద్వారా

-మిగతా 2 లో



## అమెరికాకు షాకిచ్చిన శ్రీలంక..

- యుద్ధ విమానాలు దిగేందుకు అనుమతి నిరాకరణ
- తాము యుద్ధ సమయంలో తటస్థ వైఖరి అవలంభిస్తామని అమెరికాకు శ్రీలంక స్పష్టం

న్యూఢిల్లీ

ఇరాన్‌తో యుద్ధం వేళ అమెరికాకు శ్రీలంక షాకిచ్చింది. తమ దేశానికి చెందిన రెండు యుద్ధ విమానాల్ని ల్యాండ్ చేసేందుకు అంగీకరించాలంటూ అమెరికా చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. తాము యుద్ధ సమయంలో తటస్థ వైఖరి అవలంభిస్తామని అమెరికాకు శ్రీలంక స్పష్టం చేసింది. ఈ మేరకు శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే శుక్రవారం అక్కడి పార్లమెంట్‌లో దీనిపై ప్రకటన చేశారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. అమెరికాకు చెందిన రెండు యుద్ధ విమానాలు ఆఫ్రికాలోని డిబౌటి పట్టణంలో ఉన్నాయి.ఈ విమానాలు ఒక్కో దాంట్లో ఎనిమిది యాంటీ షిప్ మిస్సైల్స్ ఉన్నాయి. ప్రస్తుతం ఇరాన్‌తో యుద్ధం జరుగుతున్న వేళ వాటిని వ్యూహాత్మకంగా వాడేందుకు శ్రీలంకకు తీసుకురావాలనుకుంది. ఇందుకోసం ఆయుధాలతో కూడిన ఈ విమానాల్ని శ్రీలంకలోని మట్టాలా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ చేస్తామని, ఇందుకు అనుమతించాలని అమెరికా కోరింది. ఈ నెల ప్రారంభంలో ఈ అంశంపై శ్రీలంక అధ్యక్షుడు దిస్సనాయకేతో అమెరికాకు

-మిగతా 2 లో

## పిరికిపందలు.. మిమ్మల్ని గుర్తు పెట్టుకుంటాం..!

మొదటి తరువాయి

వ్యక్తం చేస్తున్న ఈ దేశాలపై శుక్రవారం మరోసారి ట్రంప్ విరుచుకుపడ్డారు. చమురు, గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని నాటో దేశాలు గగ్గోలు పెడుతున్నాయి. కానీ, హర్మూజ్ జల సంధిని తెరచి ఉంచేందుకు మాత్రం మాతో కలిసి రావడం లేదు. అమెరికా లేకుండా నాటో సంస్థ కాగితంపై మాత్రమే పులి' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. జపాన్ సహా కొన్ని యూరోపియన్ దేశాలు మాత్రం హర్మూజ్ జలసంధిని సంరక్షించేందుకు ముందుకొచ్చాయి. 'నాటోలోని కొన్ని దేశాల రక్షణ కోసం అమెరికా ఏటా కొన్ని వందల కొద్ది బిలియన్ డాలర్లను ఖర్చు చేస్తోంది. కానీ, బదులుగా అమెరికాకు ఈ దేశాలు ఏమీ చేయడం లేదు. ఇరాన్ సైన్యాన్ని అమెరికా నాశనం చేసింది. ఆ దేశ నావికా దళం, వాయుసేన, నాయకత్వాన్ని దెబ్బతీశాం. ఇప్పటివరకూ ప్రపంచంలోనే అమెరికా శక్తివంతమైన దేశం. మాతో కలిసి వచ్చేందుకు నిరాకరిస్తున్న నాటో దేశాలు చాలా తెలివితక్కువ పొరపాటు చేస్తున్నాయి.ఒకవేళ ఈ దేశాలు అంగీకరించినా ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకునేందుకు, కీలకమైన జల రవాణాను ఏర్పరచుకునేందుకు మేము అనుమతించే వాళ్లం కాదు' అని ట్రంప్ వెల్లడించారు. ఇప్పటికే ఇరాన్‌పై దాడుల్లో అమెరికా సైన్యం విజయవంతమైందని, తమకు నాటో దేశాల సాయం అవసరం లేదని ట్రంప్ తేల్చి చెప్పారు. అంతేకాదు తమకు జపాన్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా సైతం సాయం చేయనక్కర్లేదని ఆయన పేర్కొన్నారు.

## ఇంటి పని, వంట పని
## చేయకపోతే క్రూరత్వం కాదు..

మొదటి తరువాయి

పెళ్లైన వారం తర్వాత నుంచి భార్య ప్రవర్తనలో మార్పు వచ్చిందని భర్త ఆరోపించాడు. తనను సరిగ్గా చూసుకోవడం లేదని, వంట చేయడం లేదని ఆరోపించాడు. అలాగే, తన తల్లిదండ్రుల్ని కూడా అసభ్య పదజాలంతో తిడుతోందన్నాడు. తనకు కొడుకు పుట్టినా, నామకరణానికి కూడా తనను, కుటుంబ సభ్యుల్ని ఆహ్వానించలేదని కోర్టుకు తెలిపాడు. అందువల్ల ఆమె నుంచి విడాకులు కావాలని కోరాడు. దీనిపై భార్య స్పందించింది. తను ప్రెగ్నెన్సీ సమయంలో భర్త, అత్తవారింటి అనుమతితోనే డెలివరీకి పుట్టింటికి వెళ్లానని, నామకరణానికి పిలిచినా వాళ్లు రాలేదని తెలిపింది. నగలు, డబ్బు కావాలని డిమాండ్ చేసినట్లు తెలిపింది. ఇరువురి వాదనలు విన్న ఫ్యామిలీ కోర్టు మధ్యవర్తిత్వానికి ఆదేశించింది. ఇరువురికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో భర్త విజ్ఞప్తి మేరకు ఇరువురికి ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసింది. కానీ, ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన విడాకుల్ని సవాలు చేస్తూ భార్య హైకోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన హైకోర్టు.. ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన విడాకులపై స్టే విధించింది. దీంతో భర్త హైకోర్టు ఆదేశాల్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంలో వాదనలు జరిగాయి. తను పెళ్లి చేసుకుంది పని మనిషిని కాదని, జీవిత భాగస్వామిని అనే విషయం గుర్తు పెట్టుకోవాలని భర్తకు సూచించింది. భార్య ఇంటి పనులు చేయనంత మాత్రాన క్రూరత్వంగా భావించలేమని తెలిపింది. అంతేకాదు.. ఇది పాత కాలం కాదని, కొత్త తరం అని, అందువల్ల భర్తలు కూడా వంట చేయడం, బట్టలు ఉతకడంలో సాయపడాలని సూచించింది. తదుపరి విచారణ సందర్భంగా ఇరువురూ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది.

## అమెరికాకు షాకిచ్చిన శ్రీలంక..

మొదటి తరువాయి

చెందిన సౌత్, సెంట్రల్ ఆసియా ప్రతినిధి సెర్గియో గోర్ చర్చలు జరిపారు. ఈ నెల 4న శ్రీలంకలో విమానాల్ని ల్యాండ్ చేసేందుకు అనుమతించాలని కోరారు. కానీ, దీనికి అధ్యక్షుడు దిస్స నాయకే నో చెప్పారు. తాము ఈ యుద్ధ సమయంలో తటస్థంగానే ఉండదలిచామని దిస్సనాయకే తెలిపారు. మిడిల్ ఈస్ట్ యుద్ధం సమయంలో ఎంత ఒత్తిడి ఎదురైనా తటస్థంగానే ఉన్నామని, ఈ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని ఆయన స్పష్టం చేశారు.అమెరికాతో చర్చల సందర్భంగా సముద్ర మార్గాల రక్షణ, పోర్టుల భద్రత, వ్యాపార, వాణిజ్య రంగాల్లో సహకారం వంటి అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చినట్లు దిస్సనాయకే తెలిపారు. ఇక, ఈ విమానాలు ల్యాండ్ అవ్వాల్సిన మార్చి 4న ఇరాన్ యుద్ధ నౌకపై అమెరికన్ టోర్పిడోడ్ దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 84 మంది మరణించారు. 32 మందిని శ్రీలంక నేవీ రక్షించింది. ఈ ఘటన శ్రీలంక సముద్ర జలాల సరిహద్దులోనే జరిగింది. మరోవైపు ఇరాన్ యుద్ధం ప్రభావం శ్రీలంకపై కూడా పడింది. ముఖ్యంగా చమురుకు ఇబ్బందులు పడుతోంది. అందుకే అక్కడ వారానికి 4 రోజులే పనిదినాలుగా ప్రకటించింది. ఇప్పటివరకు శ్రీలంకలో ఐదు రోజులే పని దినాలుగా ఉండేవి. శని, ఆదివారాల్లో సెలవులుండేవి. కానీ, ఇప్పుడు బుధవారం కూడా సెలవు దినంగా ప్రకటించింది.

## బడ్జెట్‌లో ఆర్భాటపు అంకెలు...ప్రగల్భాలు

మొదటి తరువాయి

ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బండి సంజయ్ కుమార్ స్పందిస్తూ తీవ్రంగా విమర్శించారు. 'మోసం.. దగా.. ప్రజా వంచన బ్జడెట్ ఇది' అంటూ వ్యాఖ్యలు చేశారు.మరో రూ.లక్ష కోట్ల అదనపు అప్పు భారం ప్రజలపై మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం సిగ్గు చేటని అన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించడంలో కాంగ్రెస్ హ్యాట్రిక్ కొట్టిందని అన్నారు. కేంద్రంపై ఆధారపడటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకేమీ చేయలేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. రైతు భరోసా నిధులు రెండు విడతలు ఎగ్గొట్టినట్లేనా అని కేంద్రమంత్రి ప్రశ్నించారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీల నోట్లో మళ్లీ మట్టి కొట్టారని ఆరోపించారు. 'మహిళలను మళ్లీ వంచించారు... తులం బంగారం తుస్.. రూ.2,500లు నిల్' అని అన్నారు. అవ్వాతాతల నోట్లో మట్టి కొట్టారని.. రూ.4 వేల పెన్షన్ పెంపు గురించి ఊసే లేదని విమర్శించారు. నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని.. బ్జడెట్‌లో నిరుద్యోగ భృతి అంశమే లేదని ఆయన అన్నారు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు అంటూ ప్రకటించినా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. ఆరు గ్యారంటీలకు పాడె కట్టే బ్జడెట్ ఇదని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీకి కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యాశాఖ కమిషన్ ప్రతిపాదించినా 8 శాతానికే పరిమితం చేశారని బండి సంజయ్ విమర్శించారు. దేవాదాయ శాఖకు గత బ్జడెట్‌లో రూ.190 కోట్లు కేటాయించినా ఈసారి ప్రస్తావనే లేదని అన్నారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కంటి తుడుపు కేటాయింపులు మాత్రమే ఇచ్చారని తెలిపారు. 56 శాతం బీసీ జనాభాకు కేవలం 4 శాతం మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కూడా బ్జడెట్‌లో అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. మైనారిటీలకు గతేడాది కంటే ఎక్కువ నిధులు కేటాయించడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని ఆర్థిక మంత్రి చెప్పడం సిగ్గు చేటని విమర్శించారు. దావోస్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో వచ్చిన పెట్టుబడుల వివరాలు వెల్లడించే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా అని.. ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తున్నారని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ చేసిన అప్పుల భాగోతంపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

## జాబ్ ఫస్ట్ అనేది కూటమి లక్ష్యం

మొదటి తరువాయి

ఉద్యోగాలు భర్తీచేస్తామని వివరించారు. ఉగాది పచ్చడి జీవితాలను ప్రతిబింబిస్తుందని, షడ్రుచుల తరహాలో జీవితంలోనూ కష్టసుఖాలు ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. 2047 నాటికి తెలుగుజాతిని అగ్రస్థానంలో నిలిపేలా సంకల్పం తీసుకుని ముందడుగు వేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. యువతకు ఉద్యోగ కల్పనకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఇప్పటివరకు 30,607 మందికి ప్రభుత్వోద్యోగాలు ఇచ్చాం. ప్రైవేటురంగంలో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం' అని సీఎం వివరించారు.జాబ్ ఫస్ట్ అనేది కూటమి ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనికి ఉగాది కానుకగా విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌ను జత చేశారు. 'శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా వివిధ ప్రభుత్వశాఖల్లో 10,060 ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నాం. మే 15 నుంచి అక్టోబరు 15 వరకు వీటి నోటిఫికేషన్లు విడుదల చేస్తాం. ఉద్యోగార్థులు సన్నద్ధత, ప్రతిభతో అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరుతున్నాను' అని అందులో పేర్కొన్నారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేష్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పంచాగశ్రవణం చేశారు.

# రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్

మొదటి తరువాయి

భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు. రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అటు శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ అంటే అంకెల చుట్టూ తిరగడం కాదని, అభివృద్ధి సంఖ్యలను ఆవిష్కరించ డమని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా తాము చేస్తున్న కృషికి బడ్జెట్ తార్కాణమని, గత రెండేళ్ల అభివృద్ధి ఇందుకు నిదర్శనమని అన్నారు. మొత్తం బడ్జెట్.. రూ.3,24,234 కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లుగా చూపారు. బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే.. 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటాయించారు. బడ్జెట్ లో 5 కీలక రంగాలకు భట్టి ప్రాధాన్యతనిచ్చారు. వ్యవసాయం, రైతు సంక్షేమం రూ. 23,179 కోట్లు కేటాయించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా, పంట బీమా, రుణమాఫీ పథకాలకు తెలంగాణ బడ్జెట్లో అగ్రతాంబూలం ఇచ్చారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సర్కారు విద్యారంగానికి భారీగా నిధులు కేటాయించింది. విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట అంతర్జాతీయ ప్రమాణాలతో గురుకుల పాఠశాలల నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీతో యువతకు ఉపాధి కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు భారీగా నిధులు కేటాయించారు. ప్రజా పాలన - ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తూ మహాలక్ష్మి,



గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), రూ. 500 కే గ్యాస్ సిలిండర్ వంటి ఆరు గ్యారెంటీల అమలుకు అవసర మైన నిధులను పుష్కలంగా కేటాయించారు.. మౌలిక సదుపాయాలకు గాను మూలధన వ్యయం రూ. 47,267 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. గత పాలనలో ఆగిపోయిన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టారు. సామాజిక భద్రత లోబీమా పథకాలను చేర్చారు. ప్రతి పేద కుటుంబానికి ధీమా కల్పించేందుకు 'ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం' కింద రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించడం ఈ బడ్జెట్‌లో ఒక కీలక అడుగుగాభావించాలి. జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటించారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందచేస్తారు. ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకారవేతనం ఇస్తారు. రూ.73,383 కోట్ల కొత్త రుణాలకు ప్రతిపాదన చేపట్టారు.. కేటాయింపులను పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు, విద్యా శాఖకు రూ.26,674 కోట్లు, వైద్య శాఖకు రూ.13,679 కోట్లు, కార్మిక శాఖకు రూ.998 కోట్లు, మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు, పర్యాటక రంగానికి రూ.1,224 కోట్లు, ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు, బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు, మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు, కల్యాణ లక్ష్మి పథకం.. రూ.3,683 కోట్లు, ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు, యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు, ఉస్మానియా యూనివర్సిటీ కి రూ.వెయ్యి కోట్లు, మెట్రో రైలు ఫేజ్-2.. రూ.600 కోట్లు, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ పథకం.. రూ.723 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ.. రూ.1143 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు, వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్.. రూ.3500 కోట్లు, మహాలక్ష్మి పథకం.. రూ.4,305 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథకం.. రూ.14,861 కోట్లు, రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు, ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటయిస్తున్నట్లు భట్టి ప్రకటించారు.

## ఫోన్ ట్యాపింగ్‌పై చట్టప్రకారమే ముందుకు

మొదటి తరువాయి

ఇకపోతే పదో తరగతి పరీక్షలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. 'ఇకపై పదో తరగతి పరీక్షలు లేనట్లే'నని చెప్పారు. ప్రస్తుతం.. దేశమంతా ప్లస్ 2 విధానం అమల్లో ఉందని ప్రస్తావించారు. తమది వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బడ్జెట్ అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో చట్టప్రకారమే ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తాము తొందరపడితే టెక్నికల్ రీజన్స్‌తో కోర్టు తిరస్కరించే ప్రమాదముందని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో న్యాయస్థానంలో ఊరట లభించలేదన్నారు. చక్రధర్ గౌడ్.. హరీశ్‌రావుపై పెట్టిన ఫోన్ ట్యాపింగ్, వేధింపుల కేసులో ఆయనకు రిలీఫ్ లభించిందని ప్రస్తావించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో తనను విచారణకు రమ్మని నోటీసులిస్తే హాజరవుతానని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో విచారణ పూర్తి కాకుండా చర్యలు తీసుకోలేమని అన్నారు. కేసీఆర్ బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారని ఆరోపించారు. అల్లుడు, కుమారుడు కలిసి కేసీఆర్‌ను గృహనిర్బంధం చేశారు. అందుకే ఆయన అసెంబ్లీకి రావడంలేదన్నారు. తెలంగాణ జాతిపిత ఎవరో ప్రజలు డిసైడ్ చేయాలన్నారు. ఏ గ్యారంటీ ఎప్పుడు అమలు చేయాలో తమ దగ్గర ప్రణాళిక ఉందని సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. బిఆర్ఎస్ నేతలు చెబితే చేయాలని లేదన్నారు. అందుకే వారు అక్కడ ఉన్నారు..మేము ఇక్కడ ఉన్నామని అన్నారు. కేసీఆర్ హయాంలో అప్పులు, తప్పులు కప్పిపుచ్చి పాలన చేశారని ఎద్దేవా చేశారు. ఆ తప్పులు తాము చేయలేమన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.3.47లక్షల కోట్ల అప్పులు చేశామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పులను తీర్చేందుకే తామీ అప్పులు చేయాల్సి వచ్చిందని ప్రస్తావించారు. ఈ 26 నెలల్లో రూ.3.3 లక్షల కోట్లు కేసీఆర్ హయాంలో చేసిన అప్పుల్నే తమ ప్రభుత్వం తీర్చిందని చెప్పుకొచ్చారు. మేం వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పులు చేశాం. రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులకు చెల్లించాం. మేం తెచ్చిన అప్పుల్లో కేవలం రూ.17వేల కోట్లు మాత్రమే వాడుకున్నాం. జాతీయ జీడీపీ కంటే తెలంగాణ జీఎస్‌డీపీ మెరుగ్గా ఉంది. జీఎస్టీ వసూళ్లు గడిచిన 2 నెలల్లో రూ.4 వేల కోట్లు దాటాయి' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక్క ఎకరాకు నీరు ఇవ్వకపోయినా రూ.44 వేల కోట్ల కాళేశ్వరంపై అప్పు తీర్చామన్నారు. హిల్ట్ టీడీఆర్ భూ బదలాయింపుల పై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఏ విచారణ కోరినా చేపట్టేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇండస్ట్రీకు చెందిన మొత్తం భూములు అమ్మినా లక్ష కోట్ల రూపాయలు రావని ముఖ్యమంత్రి తెలిపారు. హిల్ట్‌లో ఐదు లక్షల కోట్ల రూపాయల అవినీతి ఎలా జరిగిందని ప్రశ్నించారు. మంత్రి అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీ కోసం సుప్రీంకోర్టు సూచన మేరకు తెలంగాణ గవర్నర్‌ను సంప్రదిస్తామని తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను తొలగించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని అన్నారు. ఇప్పుడున్న జిల్లాలు మండలాల్లో ప్రస్తుతం ఎలాంటి మార్పులూ ఉండవని ఆయన స్పష్టం చేశారు. విద్యాశాఖ కమిషన్ ఇచ్చిన రిపోర్టును కేకే కమిటీకి రిఫర్ చేశామని పేర్కొన్నారు. భూముల అమ్మకానికి కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని సీఎం స్పష్టం చేశారు. భూములు అమ్మితే వచ్చిన డబ్బులను సొంతానికి వాడుకోవడానికి తాము వ్యతిరేకమన్నారు. మూసీ విషయంలో ఆగేది లేదన్నారు. నష్టపోయిన వారిని ఎలా ఆదుకోవాలో ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకుంటామని తెలిపారు. ఢిల్లీకి ఎన్నిసార్లు వెళ్లానో లెక్కపెట్టిన వాళ్లు తాను ఎన్ని నిధులు తెచ్చానో కూడా లెక్కపెట్టాలని హితవు పలికారు. గాంధీ మనుమడు కూడా ఒక పౌరుడేనని.. ప్రస్తుతం ఆయనా బీఆర్ఎస్ ట్రాప్‌లో పడ్డారని అన్నారు. గాంధీ విగ్రహం పెట్టొద్దని అనడం సరికాదని, గాంధీ దేశానికి ఆదర్శపురుషుడని అన్నారు. డ్రగ్స్ అంశంలో ఇంత జరుగుతుంటే.. బీజేపీ నేతలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలను తిడితే బీజేపీ ఎందుకు మాట్లాడుతోందని నిలదీశారు. ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకే ముఖ్యమంత్రిని ఎన్నుకుంటారని అన్నారు. తనను సీఎంగా అంగీకరిస్తున్న మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. జీవన్ రెడ్డి అంశాన్ని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చూసుకుంటారన్నారు. ఆపరేషన్ కగార్ కేంద్ర ప్రభుత్వానిది.. తమది కాదని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ విద్యావ్యవస్థలో సమూలంగా మార్పులు తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిపై కమిటీ అధ్యయనం చేస్తోందన్నారు. మార్పులపై కమిటీ నివేదికే ఫైనల్ కాదన్నారు. జాతీయస్థాయి అధ్యయనం తర్వాత మార్పులు తీసుకురాబోతున్నట్లు చెప్పారు.

## ఆరు గ్యారెంటీలకు సమాధి కట్టారు

మొదటి తరువాయి

2,500 పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇందులో సకలజనుల దక్కింది గుండు సున్నా తప్ప ఏమీ లేదని హరీష్‌రావు విమర్శించారు. అంకెలగారడీ, మాటల గారడీ తప్ప ప్రభుత్వానికి పేదలపట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదనే విషయం ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రజలకు అభయహస్తమని హామీ ఇచ్చారని, ఇప్పుడు మూడో బడ్జెట్‌లో కూడా రిక్తహస్తమే మిగిల్చారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లు కాలేదుగానీ మూడున్నర లక్షల కోట్లు అప్పులు చేసిందని, తెచ్చిన ఆ అప్పుతో ఏం చేశారని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడితే.. కాంగ్రెస్ తన రెండున్నరేళ్ల పాలనలో వెనుకపడేసిందని హరీష్‌రావు విమర్శించారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా భట్టి అంబేద్కర్ సూక్తులు, రాజ్యాంగ విలువలను వల్లెవేశారని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను వెనుక కూసోబెట్టుకుని రాజ్యాంగ విలువల గురించి ఆయన మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క గోరీ కట్టారని దెప్పిపొడిచారు. ఈ బ్జడెట్‌ను చూస్తే ఎన్నికల హామీలపై కాంగ్రెస్ సర్కార్‌కు చిత్తశుద్ధి లేదనే విషయం అర్థమైందని అన్నారు. గతం కంటే 20పేజీలు పెంచారు తప్ప.. హామీలకు కేటాయింపులు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి.. అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెప్పారని ధ్వజమెత్తారు. సీఎం ప్రజలకే కాదని.. ఎమ్మెల్యేలకు సైతం అందుబాటులో ఉండటం లేదని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 3లక్షల పింఛన్లు కట్ చేసి.. 2లక్షల కొత్త పెన్షన్లు ఇస్తామంటున్నారని అన్నారు. కోటీశ్వరులు సంగతి అటుంచి.. మొదట మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్, ఇందిరమ్మ పేర్లతో అమలవుతోన్న స్కీంలకు సైతం కేటాయింపులు ఎందుకు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్‌ది.. అభయ హస్తం కాదని.. రిక్త హస్తమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది మూడు ముక్కలాట తప్ప.. విజన్ లేదని దెప్పిపొడిచారు. బ్జడెట్‌లో అన్నివర్గాలకు మొండి చెయ్యి చూపారని ఆగ్రహించారు. మూడున్నర లక్షల కోట్లు అప్పులు తెచ్చి.. రేవంత్ చేసిందేమీ లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో సచివాలయం, కాళేశ్వరం, చెక్ డ్యాంలు కట్టామని ప్రస్తావించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను వెనుక కూర్చోపెట్టుకుని భట్టి.. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహించారు. కాంగ్రెస్ హయాంలో స్కాంలు తప్ప.. స్కీంలు లేవని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. మేడారం టెండర్లలో స్కాం జరిగిందని మంత్రి బిడ్డ స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. గురుకుల పిల్లలకు కడుపు నిండా అన్నం పెట్టలేని సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడేమో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అంటున్నారని దెప్పిపొడిచారు. పెట్టుబడుల విషయంలో ప్రభుత్వానివి కట్టుకథలని విమర్శించారు. అక్రమ సంపాదన దాచుకోవటానికే ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. మూడుసార్లు రైతుబంధు ఎగొట్టినందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పాలన గాడి తప్పటం వలనే తలసరి ఆదాయం తగ్గిందని అన్నారు. పారిశ్రామికవేత్తలకు తుపాకులు పెట్టి మాముళ్ల వసూళ్ల చేస్తున్నారని ఆరోపించారు.

# అధికారుల కనుసైగల్లో భారీ అక్రమ నిర్మాణం

- అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న ఏసిపి
- రెసిడెన్షియల్ పర్మిషన్, కమర్షియల్ నిర్మాణం
- "అందరికీ ఇచ్చాం, ఏం చేస్తారో చేసుకోండి" అన్న ధీమా



**హైదరాబాద్, మార్చి20 (నేటి దర్శిని):** యూసుఫ్ గూడ సర్కిల్ పరిధిలో అధికారుల నిర్లక్ష్యం, బిల్డర్ల ధైర్యం కలిసి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట లేకుండా పోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని కమర్షియల్ భవనాలు నిర్మించడం ఇప్పుడు సాధారణ వ్యవహారంగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం రెసిడెన్షియల్ పర్మిషన్ తీసుకుని బిల్డర్ కమర్షియల్ నిర్మాణం చేపట్టాడు. భవనంలో స్టిల్ట్ ఫ్లోర్‌ను పూర్తిగా వ్యాపార కార్యకలాపాలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పార్కింగ్ సమస్య ఏర్పడుతుందని దీంతో కాలనీ ప్రశాంతత దెబ్బతింటుందని, ట్రాఫిక్ సమస్యలు పెరుగుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ ఆ తర్వాత చర్యలు తీసుకోకుండా మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోంది. నోటీసులు ఇచ్చి ఆగిపోవడం వెనుక సెటిల్మెంట్లు జరిగాయా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై కూల్చివేతలు చేయకుండా ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

**అధికారులందరికీ ఇచ్చాం, ఏం చేస్తారో చేసుకోండి..**

స్థానికులు ఫిర్యాదు చేసిన అధికారులకు కావలసింది ఇచ్చాము అంటు బిల్డర్ బహిరంగంగానే ధీమా వ్యక్తం చేస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యాఖ్యలే అధికారుల పనితీరుపై అనుమానాలు పెంచుతున్నాయి. యూసుఫ్ గూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేష్, ఏసీపీ రమేష్, టీపీఎస్ నాయక్‌ల బాధ్యత రాహిత్యం వల్లే ఇలాంటి అక్రమాలు పెరుగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం వెనుక అసలు కారణం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ భవనాలు కట్టడం చట్ట విరుద్ధమని తెలిసినా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాన్ని వెంటనే కూల్చివేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల మౌనమే, బిల్డర్ల కు ధైర్యంగా మారిందని యూసుఫ్ గూడలో అక్రమ నిర్మాణాలకు ఎవరు అడ్డుకట్ట వేస్తారో వేచి చూడాలి.

# హెచ్ పి గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసిన మున్సిపల్ చైర్మన్...



**ఆమనగల్, మార్చి 20(నేటి దర్శిని ప్రతినిధి)**
ఆమనగల్ పట్టణంలో శుక్రవారం లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీ(హెచ్ పి) ని ఆమనగల్ మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్ తనిఖీ చేశారు. వంట గ్యాస్ కొరత ఏమీ లేదని ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని పత్యానాయక్ చెప్పడం జరిగింది. ప్రజలకు ఇబ్బంది రాకుండా ఇంతకుముందు ఏ విధంగా అయితే సిలిండర్ల సరఫరా చేశారో గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది ఇప్పుడు కూడా అదే విధంగా సరఫరా చేయాలని ఏజెన్సీ వారికి సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు తెలుగమల్ల జగన్, మానయ్య, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పథకం అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి..

- ఆమనగల్ మాజీ సర్పంచ్, గుర్రం కేశవులు..



**ఆమనగల్, మార్చి 20(నేటి దర్శిని ప్రతినిధి);**
ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయన్ పల్లి తండాలో శుక్రవారం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాన్ని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. గుర్రం కేశవులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలుగువారి నూతన సంవత్సర ఉగాది సందర్భంగా కొత్త ఇంట్లో జీవితాన్ని ప్రారంభిస్తున్నామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని గుర్రం కేశవులు తెలిపారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని తెలిపారు. నూతన ఇంటి లబ్ధిదారులు జాటావత్ బుజ్జి దంపతులను కేశవులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాగ్య నాయక్, శ్రీను నాయక్ ,హర్యానాయక్, గోపాల్ ,రాజు, మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తండావాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతి పత్రం

- ప్రభుత్వ హామీలు అమలు చేయాలని డిమాండ్

**దేవరకొండ మార్చి 21 నేటి దర్శిని ప్రతినిధి :**
దేవరకొండ రూరల్ మండలంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. మండల అధ్యక్షులు నేనావత్ రాము నాయక్ నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో యువతకు ఉద్యోగ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి అంశాలు ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు. ప్రభుత్వంపై నమ్మకం ఉంచి ఓటు వేసిన ప్రజలు ప్రస్తుతం తీవ్ర నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. రైతులకు రైతు భరోసా సకాలంలో అందకపోవడంతో వారు అప్పులపాలవుతున్నారని తెలిపారు. అలాగే ఆదాయం, నివాసం, కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం జరుగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులకు సమయానికి ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని, మండల పరిధిలోని ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్డీవోకు సమర్పించిన వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గుండాల అంజయ్య, ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అంజి నాయక్, జిల్లా నాయకులు జల్దా భాస్కర్, రెడ్డి శంకర్, జయరామ్, కేలావత్ శంకర్ నాయక్, సిద్దు, సముద్రాల సహదేవ్, మునిని వెంకటేశ్వర్లు, అవ్వారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




# చిత్త శుద్ధి ఉంటేఆరు గ్యారెంటీలకు చట్టబద్దత చేయాలి

- బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి



బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి

**మిడ్జిల్,మార్చి 20:, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే చట్ట బద్ధత తీసుకురావాలనీ బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇవ్వడం జరిగిందన్నారు. కానీ వాటిలో ఏ ఒక్క హామీ కూడా ఇప్పటివరకు పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు.. ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి తొలం బంగారం, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి అనేక హామీలు ఇప్పటికీ అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వం మీద నమ్మకం పెట్టు కొని ఓటు వేసిన ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచిందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా సమయానికి అందకపోవడం తో రైతులు పెట్టుబడుల కోసం అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోం దన్నారు. అలాగే వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్లు అర్హులైన లబ్ధిదా రులకుఅందడంలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తు లు చేసుకున్న అనేక మంది వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ఇప్పటికీ ఒక్క పెన్షన్ మంజూరు కాలేదనీ విమర్శించారు. అర్హులైన అభ్యర్థులందరి దరఖాస్తు లను వెంటనే ఆమోదించి వారికి పెన్షన్లు అందించాలని డిమాండ్ చేశారు. పేదలకు ప్రభుత్వం ప్రకటించిన గృహ నిర్మాణ పథకం కింద అర్హులై న లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు మంజూరు చేసే ప్రక్రి యను వేగవంతంచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిం చిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు దరఖా స్తులు సమర్పించి నప్పటికీ వారి సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదన్నారు. ఆ దరఖాస్తుల ను తక్షణమే పరి ష్కరించి ప్రజలకు న్యాయం చేయాల ని కోరారు

# ఉగాది సంబరాల్లో ఉప్పల కుటుంబం





**నాగోల్, మార్చి20 (నేటి దర్శిని):**
తెలుగు ప్రజల నూతన సంవత్సర ఆరంభాన్ని సూచించే ఉగాది పర్వదినాన్ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త,నాగోల్ లోని తమ నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి భక్తి శ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. చీ ఉదయం వేళలోనే ఇంటిని శుభ్రపరచి, మామిడి ఆకులతో తొరణాలు కట్టి, రంగవల్లులతో అలంకరించారు. అనంతరం పూజా కార్యక్రమాలను ప్రారంభించి, గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోమాతకు పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి, నైవేద్యాలు సమర్పించి, హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడి తయారు చేసి, దాని ప్రాముఖ్యతను కుటుంబ సభ్యులకు వివరించారు. జీవితం లోని ఆరు రుచులను సూచించే ఉగాది పచ్చడి మనిషి జీవితంలోని సుఖ, దుఃఖాలు, ఆనందాలు, కష్టాలు అన్నింటినీ సమానంగా స్వీకరించాలని సూచిస్తుందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి పంచాంగ శ్రవణం నిర్వహించి, కొత్త సంవత్సర ఫలితాలను తెలుసుకున్నారు. పెద్దల ఆశీస్సులు తీసుకొని, ఇంటి వాతావరణం ఆధ్యాత్మికతతో నిండిపోయింది. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త, మాట్లాడుతూ, ఉగాది పండుగ మన సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక అని పేర్కొన్నారు. ఈ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం, విజయాలు నింపాలని ఆకాంక్షిస్తూ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ ప్రధమ మహిళ ఉప్పల స్వప్న ,కుమారుడు ఉప్పల సాయి కిరణ్ ,కోడలు శార్వరీ చిన్న కుమారుడు ఉప్పల సాయి తేజ, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ఏఆర్‌సీఐలో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ పైలట్ ప్లాంట్ ప్రారంభం






- స్వయం సమృద్ధి దిశగా భారత్‌కు కీలక అడుగు: Nd-Fe-B మ్యాగ్నెట్ ప్లాంట్ ఆవిష్కరణ
- అరుదైన ఖనిజాల్లో భారత్ బలోపేతం -- హైదరాబాద్‌లో అధునాతన పైలట్ ప్లాంట్ ప్రారంభం
- ఈవీలు, పునరుత్పాదక రంగాలకు ఊతం: ఏఆర్‌సీఐలో కొత్త మ్యాగ్నెట్ తయారీ కేంద్రం

**హైదరాబాద్, మార్చి 20 (నేటి దర్శిని):** భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం పరిధిలోని స్వయంప్రతిపత్తి సంస్థ అయిన హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్‌సీఐ)లో Nd-Fe-B (నియోడైమియం-ఐరన్-బోరాన్) రేర్ ఎర్త్ పర్మినెంట్ మ్యాగ్నెట్స్ తయారీ కోసం ఆధునాతన పైలట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను శాస్త్ర, సాంకేతిక విభాగం కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరాండికర్, ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ ఆర్. విజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అశుతోష్ శర్మ, డాక్టర్ ఎస్.కె. ఝా, డాక్టర్ శివకుమార్ కళ్యాణరామన్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ పైలట్ ప్లాంట్ స్ట్రిప్-కాస్ట్ అల్లాయ్ నుంచి ఫినిష్డ్ సింటర్డ్ మ్యాగ్నెట్స్ వరకు పూర్తి స్థాయి తయారీ ప్రక్రియను అందిస్తుంది. దీని ద్వారా స్వదేశీ తయారీ సామర్థ్యాలను పెంపొందించడం, పరిశ్రమలతో అనుసంధానం బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా రేర్ ఎర్త్ సరఫరా కొద్ది దేశాలకే పరిమితమైన నేపథ్యంలో, ఈ ప్లాంట్ భారతదేశానికి వ్యూహాత్మక స్వయం సమృద్ధిని అందించడంలో కీలక పాత్ర పోషించనుంది. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఈ మ్యాగ్నెట్స్ కీలకంగా ఉపయోగపడతాయి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అభయ్ కరాండికర్ మాట్లాడుతూ, "వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని సాధించడంలో కీలక సాంకేతికతలలో స్వదేశీ సామర్థ్యాలను పెంపొందించడం అత్యవసరం" అని పేర్కొన్నారు. అలాగే, పరిశోధన స్థాయి నుంచి తయారీ స్థాయికి మారడంలో ఈ ప్లాంట్ ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రొఫెసర్ అశుతోష్ శర్మ అన్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ ప్లాంట్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచడమే కాకుండా, డీప్-టెక్ స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడంతో పాటు, స్వదేశీ ఆవిష్కరణలను వాణిజ్య స్థాయికి తీసుకెళ్లడంలో కీలక వేదికగా నిలవనుంది.




# నిశ్చితార్థ వేడుకలో బిఆర్ఎస్ నాయకుల సందడి


- శివర్ల కుటుంబానికి శుభాకాంక్షలు



**చింతపల్లి మార్చి 20 నేటి దర్శిని ప్రతినిధి :** చింతపల్లి మండలంలోని తీదేడు గ్రామానికి చెందిన శివర్ల నర్సింహా--పద్మ దంపతుల కుమారుడు శివ నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు సోనగంటి గొవర్ధనాచారి, మగ్రు రామారావు, ఉలుపాల పురుషోత్తం రెడ్డి, సిమర్ల శ్రీను యాదవ్, కాయితి బచ్చిరెడ్డి, తిరుమణి పాపయ్య, దాసరి తిరుపతయ్య, మాదగోని కృష్ణ గౌడ్, బొడ్డు యాదగిరి, బెక్కం సైదులు,మెరిక శంకరయ్య తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకను ఉత్సాహభరితంగా నిర్వహించారు.

# మొండి బకాయిదారులపై బల్దియా కొరడా...!

- రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగిస్తాం: జె అరుణశ్రీ



**నేటి దర్శిని/గోదావరిఖని: మార్చి20** ఆస్తి పన్ను చెల్లించని బడా బకాయదారులపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బడా బకాయదారుల జాబితా తయారు చేసి తదుపరి చర్యల నిమిత్తం జిల్లా కలెక్టర్ కి సమర్పించినట్లు ఆమె తెలిపారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం సదరు ఆస్తులను జప్తు చేసి వేలం వేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. వేలం ద్వారా వచ్చిన ఆదాయంతో బకాయలు పూడ్చుకోవడం జరుగుతుందని అన్నారు. చివరి హెచ్చరికగా రెడ్ నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించని వారి పై ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాగా శని, ఆదివారాలు సెలవు రోజులైనప్పటికీ రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌంటర్లు యధాతధంగా పని చేస్తాయని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బకాయదారులు ఇంటి పన్ను , నల్లా బిల్లు , ట్రేడ్ లైసెన్స్ బకాయలు వెంటనే చెల్లించి నగర పాలక సంస్థకు సహకరించాలని ఆమె కోరారు.

# చిల్లర రాజకీయాలు మానుకోండి అభివృద్ధిపై పోటీ పడండి: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి





- కాంగ్రెస్ పై ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు

**ఎల్బీనగర్, మార్చి20 (నేటి దర్శిని):** ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో 'వైట్ ఛాలెంజ్' పేరుతో యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రకటించిన డ్రగ్ టెస్ట్ కార్యక్రమం ఉద్రిక్తతలకు దారితీసింది. అంబేద్కర్ విగ్రహం వద్దకు రావాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చిన నేపథ్యంలో, ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు పోలీసులను అడ్డుగా పెట్టుకుని బీఆర్ఎస్ నాయకులను అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లనీయకుండా అడ్డుకోవడం దురదృష్టకరమని విమర్శించారు. ఇది వారి ద్వంద్వ వైఖరికి, చిల్లర రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. సవాళ్లు విసిరిన తర్వాత వాటికి సమాధానం చెప్పేందుకు వెనక్కి తగ్గడం కాంగ్రెస్ నాయకుల వైఫల్యాన్ని స్పష్టంగా చూపుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తాము శాంతియుతంగా డ్రగ్ టెస్ట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, అధికార అహంకారంతో పోలీసు బలగాలను వినియోగించడం తగదని ఆయన అన్నారు. ఎల్.బి.నగర్‌లో ఇంతవరకు లేని విధంగా ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రాంతానికి సంబంధం లేని వ్యక్తులు ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. సవాళ్లు విసిరిన తర్వాత కార్యకర్తలకు అండగా నిలవకపోవడం బాధాకరమని అన్నారు. తాము ఎప్పుడైనా, ఎక్కడైనా డ్రగ్ టెస్ట్‌కు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, తమ కార్యకర్తలపై పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. డ్రగ్స్ సంస్కృతిని తమ పార్టీ ఎప్పటికీ ప్రోత్సహించదని, తమ నాయకుడు కేటీఆర్‌పై చేసిన ఆరోపణలు కూడా నిరాధారమని పేర్కొన్నారు. అవసరమైతే ఆయన కూడా పరీక్షలకు సిద్ధంగా ఉన్నారని గుర్తుచేశారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూగర్భ జలాలను పెంచే దిశగా ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి

- మంచిర్యాల డిఆర్డిఏ కిషన్



**జైపూర్, మార్చి 20 నేటి దర్శిని** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ముదిగుంట గ్రామ పంచాయతీ లో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా మంచిర్యాల డిఆర్డిఏ కిషన్. ఎంజిఎన్ఆర్ఈజిఎస్ నిధుల ద్వారా చెప్పట్టుచున్న రెయిన్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను, కమ్యూనిటీ సోక్ పిట్లను, ఇంటింటికి మ్యాజిక్ సోక్ పిట్ లను పరిశీలించడం జరిగింది. డిఆర్డిఏ కిషన్ ముదిగుంట గ్రామములో పర్యటిస్తూ గ్రామ ప్రజలకు ఇంకుడు గుంతల అవశ్యకతను, వాటర్ రీఛార్జ్ ల గురించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో డిఆర్డిఏ కిషన్ వెంట జైపూర్ ఎంపీడీఓ జి.సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపు రావు, ముదిగుంట సర్పంచ్ ఆకుల రవి కుమార్,ఈ జి ఎస్ ఏపీఓ బి. బాలయ్య, పంచాయతీ కార్యదర్శి పి. సురేష్, టీ ఏ ఈ జి స్ శిరీష, వాటర్ షెడ్ సిబ్బంది శ్రీనివాస్, శివాజీ పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఇంకుడు గుంతల నిర్మాణం చేయడం వలన భూగర్భ జలాల నీటి స్థాయి పెరగడం వలన కలిగే లాభాలను తెలియజేయడం జరిగింది.అంతేకాక ఈ కార్యక్రమంలో ముదిగుంట గ్రామంలోని ఐకేపీ మహిళా సభ్యులందరూ పాల్గొనడం జరిగింది.మహిళా సభ్యులందరిచే భూగర్భ జలాలను పెంచే దిశగా ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణం త్వరితగతిన చేపడతామని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.

# కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ముస్లింలకు సంక్షేమ ఫలాలు

- 5వ వార్డ్ కౌన్సిలర్ సింగపాగ్ శిరీష అనిల్ కుమార్
- 5వ వార్డ్ సోలిపూర్ లో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా కిట్ల పంపిణీ



**షాద్ నగర్ 20మార్చ్ ( నేటి దర్శిని ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని షాద్నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డ్ సోలిపూర్ గ్రామంలోని ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేసింది. ఐదవ వార్డ్ కౌన్సిలర్ సింగపాగ శిరీష అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఏడు ముస్లిం మైనార్టీ కుటుంబాలకు స్వయంగా వారి ఇంటికి వెళ్లి రంజాన్ తోఫా కిట్లను అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉందని, రంజాన్ సందర్భంగా అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ముస్లిం సోదరులు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం ముస్లిం మైనార్టీ సోదరులు రంజాన్ సందర్భంగా తోఫాను అందజేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు శివరాములు యాదవ్, కావలి కృష్ణయ్య యాదవ్, మాజీ వార్డు సభ్యులు సింగపాగా లక్ష్మయ్య, సింగపాగ అనిల్ కుమార్, బాబర్, మహేష్ గౌడ్, ఎండి హాజీ, బాబు నాయక్, బాలు, కుమ్మరి శీను, అరవింద్, శేఖర్ యాదవ్. సర్వర్, అన్వర్ మియా తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడి...

- ప్రజా సంక్షేమం ద్యాసలేని ప్రభుత్వం
- బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి




బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

**మిడ్జిల్,మార్చి 20, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో నేడు ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడి అని సామాన్యుడి సంక్షేమం పై ద్యాసలేని ప్రభుత్వమని బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు..గత పాల కుల ఆడంబరాలకు భిన్నంగా, క్షేత్రస్థాయిలో బడ్జెట్లో 6 గ్యారంటీల సరిపడ నిధులు కేటాయిం చక మసిబూసి మారేడు కాయ చేసిందని విమర్శిం చారు.ముఖ్యంగారైతు సంక్షేమానికి పాటుపడుతూ రైతు భరోసాకు రూ.18,000 కోట్లు,పంట బీమాకు రూ. 1,886 కోట్లు, సన్న వడ్ల బోనస్ కోసం రూ. 3,5 00 కోట్లు కేటాయించిన ప్రభు త్వం అంతా గారడి చేసిందని ఇంతవరకు రైతు రుణమాఫి చేయలేదని రైతుబంధు ఎగవేసిందని ఆరోపించారు.మహిళా సాధికారత సాధన యే లక్ష్యంగా మహాలక్ష్మి పథకం తప్పా ప్రతి గృహానికి నెలకు 2వేల 5 వందల సహాయం ఊసు లేదన్నారు.విద్య, యువత స్వయం సంవృద్ధి పై అసలే ద్యాసలేదన్నారు.నిరుద్యోగ భృతి కి ఎలాంటి నిధులు కేటాయించకుండా నిరుద్యోగులను మళ్ళీ వంచించిందని అన్నారు.బడ్జెట్ లో కేటాయించిన నిధులు ఫీజు రియాంబర్స్ మెంట్ కోసం ఎములకు సరిపోవని అన్నారు.మొత్తానికి ఆర్థిక మంత్రి భట్టి ప్రవేశ పెట్టిన బడ్జెట్ అట్టర్ ఫ్లాప్ అని పేర్కొన్నారు

# అంబర్ పేట సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల జోరు

- బల్దియా ఆదాయానికి గండి, చైన్ మెన్, అధికారుల జేబుల్లోకి ఆదాయం
- నోటీసులకే పరిమితమైన అధికారులు చర్యలు మాత్రం శూన్యం
- ఒక్క నోటీసుతో కాలక్షేపం వెనక కారణం ఏమిటి.?
- బురుజు గల్లిలో ఎలాంటి అనుమతులు లేకుండా యదేచ్ఛగా అక్రమ నిర్మాణం





**అంబర్ పేట,మార్చి20 (నేటి దర్శిని):** అంబర్ పేట అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవు అని చెప్పే అధికారులు కేవలం నోటీసులకే పరిమితమై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక లంచాలే కారణమా...? అంబర్ పేట సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. బురుజు గల్లి ప్రాంతంలో అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారినా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనక లంచాలే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి నిర్మాణ అనుమతులు లేకుండా చైన్ మెన్, న్యాక్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ అధికారులకు లంచాలు ఇస్తే చాలు మీరు యదేచ్ఛగా నిర్మాణం చేసుకోవచ్చు. నిబంధనలు పాటించకుండానే బహుళ అంతస్తుల నిర్మాణాలు చేసినా పట్టించుకోరు. స్థానికులు ఫిర్యాదులు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు అసలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలు కళ్ల ముందు కనిపిస్తున్నా, నోటీసులు ఇవ్వకుండా, పనులు ఆపకుండా డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనం వహించడం వెనక భారీగా ముడుపులు అందాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**లంచాలు ఇస్తే అక్రమమైన సక్రమమే...**

డబ్బు ఇస్తే చాలు నిర్మాణాలకు నిబంధనలు అక్కర్లేదు అన్నట్లు మారింది పరిస్థితి. అక్రమ నిర్మాణాల వెనుక మున్సిపల్ అధికారులకు భారీగా లంచాలు అందుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.టౌన్ ప్లానింగ్ అధికారులు, న్యాక్ ఇంజనీర్లు, చైన్ మెన్ లు కలిసి అక్రమ నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నారు. అందుకోసమే బురుజు గల్లీలో పక్కింటి నెంబర్ 2-2-474 పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతుంటే అధికారులు లంచాలు తీసుకుని జిహెచ్ఎంసి ఆదాయానికి గండికోటి నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తున్నారని పత్రికలో కథనాలు వచ్చిన అధికారులు స్పందించడం లేదంటే ఎంత భారీ స్థాయిలో లంచాలు అందాయో అర్థం చేసుకోవచ్చు అని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా సీఈ కాలనీలోని పక్కింటి నెంబర్ 2-2-647/235/2ఎ అక్రమ నిర్మాణం అదే కాలనీలో పక్కింటి నెంబర్ 2-2- 647/234 అక్రమ అంతస్తులు యదేచ్ఛగా నిర్మాణాలు జరుగుతుంటే కేవలం నోటీసులు ఇచ్చారు చర్యలు తీసుకుంటాం అంటూ కాలం గడుపుతున్నారు తప్ప చర్యలు తీసుకోకపోవడం పై చైన్ మెన్ అశ్విన్ చక్రం తిప్పుతున్నారని కమిషనర్ అక్రమ నిర్మాణాలపై సీరియస్ గా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

**అక్రమ నిర్మాణాలకు డిప్యూటీ కమిషనర్ అండదండలా..?**

అంబర్ పేట సర్కిల్ లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ అసలు పట్టించుకోవడంలేదని ఆయన నిర్లక్ష్యంతోనే టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బంది అక్రమ నిర్మాణాలను చేయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏసిపి, సెక్షన్ ఆఫీసర్ ఎవరు ఫోన్ ఎత్తరని కేవలం వాళ్లకు డబ్బులు ఇచ్చే వాళ్లయితేనే ఫోన్లు ఎత్తుతారా అంటూ ప్రజల ప్రశ్నిస్తున్నారు. ఇందులో చైన్ మెన్ అశ్విన్ కీలక పాత్ర పోషిస్తున్నాడని ఆయన అవినీతికి హద్దు అదుపు లేకుండా పోయిందని వివరణ కోసం ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ ఎత్తడం లేదని సాక్షాత్ జిహెచ్ఎంసి కమిషనర్ జోనల్ కమిషనర్లు కూడా ఫోన్ ఎత్తుతారు అంతకంటే పెద్ద అధికారిలాగా చైన్ మెన్ అశ్విన్ వ్యవహారం ఉందని ఎందుకు కారణం ఆయన అధికారులకు భారీగా అక్రమ నిర్మాణాల వద్ద నుండి లంచాలు వసూలు చేసి ఇవ్వడం వల్ల అధికారులు కూడా ఆయనపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇలా అధికారులు, సిబ్బంది ఎలాంటి అనుమతులు లేని అక్రమ నిర్మాణం పై కూడా చర్యలు తీసుకోవడానికి కాకమ్మ కబుర్లు చెబుతున్నారని అంటే వీళ్లకు జిహెచ్ఎంసి నిబంధనలు లెక్కలేదు, ఉన్నత అధికారులు అంటే భయం లేదు. ఇలా ఉంది జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్, కమిషనర్ పాలన ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ భవనం పై చర్యలు తీసుకుంటారో లేక లంచాలలో వాటా అడుగుతారో వేచి చూడాలి.

# ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు

- మిడ్జిల్ మాజీ సర్పంచ్ బరిగెల శారద వెంకటయ్య



మిడ్జిల్ మాజీ సర్పంచ్ బరిగెల. శారద వెంకటయ్య

**మిడ్జిల్,మార్చి 20, (నేటి దర్శిని ప్రతినిధి);** నెలరోజులపాటు పవిత్రంగా ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులకు మిడ్జిల్ మాజీ సర్పంచ్ బరిగెల శారద వెంకటయ్య రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగా సందర్భంగా వారి జీవితంలో కొత్త వెలుగులు నింపాలని, అల్లాహ్ ఆశీర్వదించాలని కోరుకున్నారు. రంజాన్ మాసంలో మీరు చేసిన ప్రార్థనలు, ఉపవాసాలు అల్లాహ్ స్వీకరించాలని, ప్రతి ఒక్కరూ శాంతియుతంగా ఈ పవిత్ర రంజాన్ పండుగను జరుపుకోవాలని చెప్పారు. ప్రతీ ఒక్క ముస్లిం సోదరుడికి, సోదరీ మనులకు, వారి కుటుంబానికి పండుగా శుభాకాంక్షలు తెలిపారు.

# రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు


- తెలిపిన జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపిఎస్




**మిడ్జిల్, మార్చి 20, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ముస్లిం లందరికీ హృదయపూర్వక రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర పర్వదినం అందరి జీవితాల్లో ఆనందం, శాంతి, సౌభ్రాతృత్వం నింపాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, "రంజాన్ పర్వదినం ముస్లిం లకు ఎంతో పవిత్రమైనది. ఉపవాస దీక్షల ద్వారా సాధించే ఆత్మశుద్ధి, సహనం, సేవాభావం సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయి. ఈ పవిత్ర సందర్భంగా ప్రతి ఇంట్లో సంతోషం, శాంతి నెలకొనాలని కోరుకుంటున్నాను. పరస్పర గౌరవం, ఐక్యతతో పండుగను జరుపుకోవాలి" అని పేర్కొన్నారు. అదేవిధంగా, ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో భద్రత మరియు ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి పోలీసు శాఖ విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి, నియమ నిబంధనలు పాటిస్తూ పండుగను సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# మిడ్జిల్ మండల ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు

- తెలిపిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు గంజి కృష్ణ



**మిడ్జిల్, మార్చి 20, (నేటి దర్శిని ప్రతినిధి):** రంజాన్ పండుగ సందర్భంగా మిడ్జిల్ మండల లోని ముస్లిం సోదరసోదరీమణులకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు గంజి కృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజుల పాటు ఉపవాస దీక్షలతో రంజాన్ మాసం శాంతి,ప్రేమ,దయ, సౌభ్రాతృత్వ గుణాలను పంచుతుందని, తెలంగాణలో గంగా జమునా తహజీబ్ కు రంజాన్ పండుగ ప్రతీక అని ఆయన తెలిపారు.మిడ్జిల్ ప్రజలంతా భక్తి, శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో ఇంటిల్లిపాది రంజాన్ పండుగను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.మైనారిటీల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర తోలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు అమలు చేసిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు ముస్లింల జీవితాల్లో వెలుగులు నింపాయని, అవన్నీ ప్రస్తుతం గుణాత్మక ఫలితాలనిస్తున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కార్ మైనారిటీల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కార్ హయాంలో అమలైన ప్రజా సంక్షేమ పథకాలు యావత్ దేశానికే దిక్సూచిగా మారాయని ఆయన తెలిపారు.

# మరల కుంట తండా రైతులకు అండగా ఉంటా!

- తాటిపర్తి గ్రామ సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్
- రిలే నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు
- భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- రెవిన్యూ అధికారులను కోరిన సర్పంచ్




**యాచారం, మార్చి 20,(నేటిదర్శిని):** మండల పరిధిలోని కురుమిద్ద గ్రామపంచాయతీ సమీపంలో మరల కుంట తండా రైతులకు అండగా ఉంటామని తాటిపర్తి గ్రామ సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్ భరోసా ఇచ్చారు. శుక్రవారం భూ సమస్యల కోసం నిరాహార దీక్ష చేస్తున్న రైతులకు సంపూర్ణ మద్దతు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం, రెవిన్యూ అధికారులు ఓ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఫ్యూచర్ సిటీ రైతులకు అండగా ఉండి, మరొక ఉద్యమానికి నాయకత్వం వహించేల కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సటూ మల్లేష్, నక్క గోపాల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# హై టెన్షన్ రోడ్డుపై అక్రమ నిర్మాణాల దందా




- నోటీసులు ఇచ్చామంటారు, చర్యలు తీసుకోరు.?
- చర్యలు తీసుకోరు ఎందుకో మరి..!
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు






**ఉప్పల్, మార్చి20 (నేటి దర్శిని):** ఉప్పల్ జోన్ పరిధిలోని కాప్రా సర్కిల్‌లో హై టెన్షన్ రోడ్డు లో అక్రమ నిర్మాణాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే ఈ అక్రమ నిర్మాణాలపై కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం నోటీసులు ఇచ్చామనే పేరుతో కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి అక్రమాలు చూస్తే ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. ప్రభుత్వ అధికారులే ఇంత అవినీతి అక్రమాలకు బరితెగిస్తే పరిస్థితి ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత అధికారులు కూడా చూసి చూడనట్లు మౌనంగా ఉండడం వెనక వాళ్లకు కూడా వాటాలు అందుతున్నాయా.? అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

**నోటీసులే.. చర్యలు లేవు**

కాప్రా సర్కిల్ పరిధిలో భారీగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలు వెలుగులోకి వచ్చిన ప్రతిసారీ అధికారులు "నోటీసులు జారీ చేశాం, త్వరలో చర్యలు తీసుకుంటాం" అంటూ చెప్పడమే గానీ వాస్తవానికి మాత్రం ఎలాంటి చర్యలు కనిపించడం లేదని దీనితో అధికారులు అక్రమ నిర్మాణదారులతో అంతర్గత ఆర్థిక ఒప్పందాలు చేసుకున్నారన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు స్థానికులు. ఇదే పరిస్థితి నెలల తరబడి కొనసాగుతుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కాప్రా టౌన్ ప్లానింగ్‌లో అవినీతి.?**

కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై తీవ్రమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాప్రా సర్కిల్ హై టెన్షన్ రోడ్లో పక్కింటి నెంబర్ 1-19--72/ 49 రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ నిర్మాణం చేయడంతో పాటు అక్రమాంతస్తులు స్టిల్ట్ లో పార్కింగ్ ఏర్పాటు చేయకుండా షట్టర్లు వేయడం పై స్థానికులు మండిపడుతున్నారు. అదేవిధంగా హై టెన్షన్ రోడ్ లోని ఈశ్వరిపురి కాలనీలో పక్కా ఇంటి నెంబర్ 165ఎ, 165బి లో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ నిర్మాణం చేయడం జరుగుతుందని అదే విధంగా అక్రమ అంతస్తులు స్టిల్ట్ లో షెటర్లు వేస్తున్నారని స్టిల్ట్ లో షెటర్లు వేసి వ్యాపారం చేస్తే పార్కింగ్ ఎక్కడ చేయాలో ఎసిపి డిప్యూటీ కమిషనర్ తెలపాలి. లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసిన అధికారులు అక్రమ నిర్మాణదారుల వద్ద లంచాలు తీసుకొని చర్యలు తీసుకుంట లేరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణదారులతో అధికారుల అంతర్గత ఆర్థిక ఒప్పందాలున్నాయా..? అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అధికారులు పత్రికలో కథనాలు వచ్చిన చలనం లేకుండా ఉండడం వెనుక లక్షలలో వసూళ్లు చేస్తున్నారన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు ఇచ్చి మళ్లీ వెనక్కి తగ్గడం వెనుక డీల్ ఉందా.? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**పత్రికా కథనాలు వచ్చిన అధికారుల నిర్లక్ష్యం..**

కాప్రా సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమాలపై పలుమార్లు పత్రికల్లో కథనాలు వెలువడినా టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణమూర్తి, డిప్యూటీ కమిషనర్ శ్రీహరి స్థాయిలో ఎలాంటి స్పందన కనిపించకపోవడం ఆశ్చర్యకరం కలిగిస్తోంది. ఇది కేవలం నిర్లక్ష్యమా.? లేక అక్రమాలకు మౌన సహకారమా.? అనే అనుమానాలు స్థానికులలో మరింత బలపడుతున్నాయి. హై టెన్షన్ రోడ్డు లో చాలా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని డిప్యూటీ కమిషనర్ ఏసిపి సెక్షన్ ఆఫీసర్ల స్పందించకపోవడం వెనక ముందుగానే అక్రమ నిర్మాణదారులు వాళ్లతో సెటిల్మెంట్ చేసుకున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన అధికారులు చర్యలు తీసుకుంట లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు ఎక్కడ.?**

ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, కమిషనర్ వినయ్ కుమార్ రెడ్డి దృష్టికి ఈ వ్యవహారం వెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఉప్పల్ జోన్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల వలన ప్రజల భద్రత, ప్రభుత్వ ఆదాయం రెండింటినీ నష్టం కలిగిస్తున్న ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదు. అక్రమ నిర్మాణాలతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది అధికారులకు లక్షలలో అక్రమ ఆదాయం వస్తుంది కానీ ప్రభుత్వానికి నష్టం, ప్రజలకు ముప్పు జరుగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం కచ్చితంగా బాధ్యతారాహిత్యమే అని ప్రజలు మండిపడుతున్నారు. అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం నష్టపోతుండగా, హై టెన్షన్ లైన్ల సమీపంలో మెయిన్ రోడ్డు పై అక్రమ నిర్మాణాలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. అయిన కూడా కమిషనర్, జోనల్ కమిషనర్, ఉన్నత అధికారుల వైఖరిలో మార్పు కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కుమార్ రెడ్డి స్పందించి సర్కిల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై తక్షణ కూల్చివేత చర్యలు తీసుకుని ప్రోత్సహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు చేపట్టాలని లేకపోతే ఈ "నోటీసుల నాటకం"పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## బౌరంపేట్ జెడ్పిహెచ్ఎస్ స్కూల్‌కు స్థలం కేటాయించాలని ఎమ్మెల్సీకి వినతి

- విద్యార్థుల ఇబ్బందులు నివారించేందుకు కొత్త భూమి కేటాయింపు కోరిన స్థానిక నాయకులు




**దుండిగల్, మార్చి20 (నేటి దర్శిని):** దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలకు విస్తృత స్థలం కేటాయించాలని కోరుతూ స్థానిక నాయకులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సమావేశం దుండిగల్ సర్కిల్ శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బౌరంపేట్‌లో ప్రస్తుతం ఉన్న పాఠశాల స్థలం పరిమితంగా ఉండటంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తరగతి గదుల కొరత, ఆటస్థలం లేకపోవడం వంటి సమస్యలు విద్యార్థుల అభ్యాసంపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. అందువల్ల ప్రభుత్వానికి చెందిన ఖాళీ భూమిని గుర్తించి పాఠశాల విస్తరణకు కేటాయించాలని వారు ఎమ్మెల్సీని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా తగిన చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్.వి. సురేందర్ రెడ్డి, సరుగారి ధర్మారెడ్డి, పాల్పనూరి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీ కింద ట్రాక్టర్ రోటావేటర్ పంపిణీ



**తిరుమలగిరి సాగర్; మార్చి 20 (నేటి దర్శిని):** తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో, స్థానిక ఎమ్మెల్యే పర్యవేక్షణలో ట్రాక్టర్ రోటావేటర్ సబ్సిడీ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాజీ సర్పంచ్ సభావత్ రాములు బద్రీ నాయక్ సబ్సిడీ కింద ట్రాక్టర్ రోటావేటర్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రైతుల ఉత్పాదకత పెంపొందించేందుకు ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తున్నదని, ఈ విధమైన వ్యవసాయ యంత్రాలు రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏఓ, గట్టుమీద తండా సర్పంచ్ రమావత్ సోనీ శంకర్ నాయక్, యువజన కాంగ్రెస్ మండల నాయకులు బొమ్మ సాయి, శ్రీను, మాత్రియా తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అర్చక సంఘానికి కొత్త అధ్యక్షుడు, కోశాధికారి నియామకం

- ఉగాది వేళ అర్చక సంఘంలో కొత్త నాయకత్వం



రాష్ట్ర డి డి యన్ అర్చక సంఘం అధ్యక్షులు పిండిప్రోలు. నాగ దక్షణమూర్తి



రాష్ట్ర డి డి యన్ అర్చక సంఘం కోశాధికారి గాండ్ల .రవికుమార్

**ఖమ్మం; మార్చి 20 (నేటి దర్శిని):** ఉగాది పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో కీలక సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఇటీవలి కాలంలో సంఘ కార్యవర్గంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో వాసుదేవ శర్మ తన పదవికి రాజీనామా చేయగా, నందన హరికిషన్ శర్మపై ఆదాయ-ఖర్చుల విషయంలో పారదర్శకత పాటించలేదన్న ఆరోపణలు రావడంతో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ క్రమంలో జనగామ జిల్లా కొడకండ్ల గ్రామానికి చెందిన ధూప దీప నైవేద్య అర్చకులు పిండిప్రోలు నాగ దక్షిణామూర్తిని రాష్ట్ర సంఘం అధ్యక్షుడిగా నియమించారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా అన్వాడ మండలం ఇబ్రహీంబాద్‌కు చెందిన అర్చకుడు గాండ్ల రవికుమార్‌ను రాష్ట్ర కోశాధికారిగా ఎంపిక చేశారు. ఈ నియామకాలను రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శులు అన్నావజ్జల ప్రసాద్ శర్మ, తిరునగరి వెంకటాద్రి స్వామి సంయుక్తంగా కార్యవర్గ సభ్యులతో కలిసి అధికారికంగా ప్రకటించారు. సంఘం బలోపేతం, పారదర్శకత, అర్చకుల సంక్షేమం కోసం కొత్త కార్యవర్గం కృషి చేస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## నసర్లపల్లిలో సీసీ రోడ్డు ప్రారంభం

- ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణం



**చింతపల్లి మార్చి 20 నేటి దర్శిని ప్రతినిధి** చింతపల్లి మండలంలోని నసర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మంజూరైన రూ. 5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను సర్పంచ్ పంబలి మాలతి వెంకటయ్య ప్రారంభించారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సమర్థంగా వినియోగిస్తున్నామని, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. గ్రామంలో రవాణా సౌకర్యం మెరుగుపడేందుకు సీసీ రోడ్లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లా వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్ దాసరి మల్లయ్య, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు దాసరి రాజు, వడ్లకొండ విజయ్ కుమార్, వార్డు సభ్యులు నల్ల అనూష యాదగిరి, వడ్లకొండ వెంకటయ్య, వలబోతు ఆదినారాయణ, షేక్ నజీర్, నోముల కృష్ణయ్య, వడ్లకొండ మల్లమ్మ, శిరమోని యాదమ్మ, జంగిటి వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగ శ్రవణంలో పాల్గొన్న కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్, మార్చి20 (నేటి దర్శిని):**
శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా హయత్ నగర్ పాత గ్రామంలోని సీనియర్ సిటిజన్ భవనంలో నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉగాది పర్వదినం ప్రతి తెలుగు మనిషి జీవితంలో కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలకు శ్రీకారం చుట్టే పండుగ అని అన్నారు. ఈ శ్రీ పరాభవ నామ సంవత్సరం ప్రతి ఒక్కరికీ సుఖసంతోషాలు, ఐశ్వర్యం, ఆరోగ్యం తీసుకురావాలని ఆకాంక్షించారు.సమాజంలో ఐక్యత, సహకారం, సౌభ్రాతృత్వం పెంపొందాలని, ప్రతి ఒక్కరూ మంచి పనులు చేస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.అలాగే యువత సన్మార్గంలో నడుచుకుంటూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. పెద్దల ఆశీర్వాదాలతో, సత్సంకల్పాలతో ఈ కొత్త సంవత్సరం మరింత శ్రేయస్సు కలిగించాలని కోరుతూ అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ శేఖర్ పంతులు, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు నక్క దర్శన్, కార్యవర్గ సభ్యులు పి. మల్లారెడ్డి,ఎన్. సహదేవ్, నక్క ప్రభాకర్, రామ్ సత్తయ్య, దీపావళి ప్రభాకర్, మరియు కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలి: శంబిపూర్ క్రిష్ణ



**కుత్బుల్లాపూర్,మార్చి20 (నేటి దర్శిని):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్ 295 డివిజన్ గండి మైసమ్మలో నూతనంగా ఏర్పాటు చేసిన "టీ టైం" దుకాణాన్ని బిఆర్ఎస్ నాయకులు శంబిపూర్ క్రిష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగా వ్యాపారం ప్రారంభించిన నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. యువత ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా, స్వయం ఉపాధి వైపు దృష్టి సారించి అభివృద్ధి సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో దుండిగల్ బిఆర్ఎస్ సర్కిల్ జనరల్ సెక్రటరీ కొల్తూరు మల్లేష్, ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ విష్ణువర్ధన్ రెడ్డి, యువ నాయకులు శ్రీధర్, రాజు తదితరులు, స్థానిక నాయకులు మరియు నిర్వాహకులు పాల్గొన్నారు.

## కాలువ జామ్.. వెంటనే శుభ్రపరిచిన సర్పంచ్

● ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు





**చింతపల్లి, మార్చి 20 నేటి దర్శిని ప్రతినిధి :**
చింతపల్లి మండలం గోడుకొండ్ల గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర్ నగర్--మాల్ సాగర్ హైవే రోడ్డుపై ఉన్న మురికి కాలువ వర్షాలకు జామ్ కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.విషయం తెలిసిన వెంటనే గ్రామ సర్పంచ్ కాశగోని వెంకటయ్య స్పందించి కాలువ శుభ్రపరిచే పనులను చేపట్టించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా కాలువలను తరచూ శుభ్రపరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మహబూబ్‌నగర్ జిల్లా ఏం.టి పూల్‌లో హైడ్రాలిక్ లిఫ్ట్ షెడ్ నిర్మాణం



● భూమిపూజ నిర్వహించిన జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్



**మిడ్జిల్, మార్చి20, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
మహబూబ్‌నగర్ జిల్లా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ పూల్ నందు హైడ్రాలిక్ లిఫ్ట్ (లాంచ్) స్థాపన కోసం షెడ్ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో వాహనాల నిర్వహణ అత్యంత కీలకమని తెలిపారు. హైడ్రాలిక్ లిఫ్ట్ (లాంచ్) ఏర్పాటు ద్వారా వాహనాలకు ఆయిల్ మార్పిడి, వాషింగ్ మరియు మరమ్మత్తులు సులభంగా, వేగంగా చేయుటకు వీలవుతుందని చెప్పారు. దీని వల్ల వాహనాల నిర్వహణ ఖర్చులు తగ్గడంతో పాటు, ఫీల్డ్ డ్యూటీలకు వాహనాలు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండేలా చేయవచ్చని వివరించారు. అలాగే, పోలీస్ శాఖలో అందుబాటులో ఉన్న వనరులను సమర్ధవంతంగా వినియోగించుకోవడం ద్వారా సేవలను మరింత మెరుగుపరచడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సిబ్బంది అందరూ తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ శాఖ ప్రతిష్టను నిలబెట్టాలని సూచించారు. ఈ పూజా కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి.రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డి.ఎస్.పి డి.సి.ఆర్.బి. రమణా రెడ్డి, వర్టికల్ డి.ఎస్.పి బాలాజీ, ఏం.టి.ఓ నగేష్, ఆర్.ఐ అడ్మిన్ కృష్ణయ్య, ఆర్.ఐ హోంగార్డ్స్ అశోక్ కుమార్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిఎం నిరవధిక దీక్షలకు ప్రజల పూర్తి మద్దతు


- ప్రజా సంఘాలకు సిపిఎం కృతజ్ఞతలు
- 100 పడకల ఆసుపత్రి డిమాండ్‌కు మద్దతు వెల్లువ
- ఆర్డీఓ హామీతో దీక్షల విరమణ
- హామీ అమలు లేకపోతే మళ్లీ ఆందోళన
- లక్ష మందికి మెరుగైన వైద్య సేవల లక్ష్యం




**రామన్నపేట, మార్చి 20 (నేటి దర్శిని):**
రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు ఆర్డీఓ హామీతో ముగిశాయి. ఈ దీక్షలకు సంఘీభావం తెలుపుతూ మద్దతుగా నిలిచిన ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, కార్మికులకు సిపిఎం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ, రామన్నపేట ప్రాంత ప్రజలు గత ఎన్నో సంవత్సరాలుగా ఆసుపత్రిలో మౌలిక వసతుల కొరతతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆసుపత్రిని 100 పడకల స్థాయికి తీసుకెళ్లడం అత్యవసరమని వారు స్పష్టం చేశారు. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ నిరవధిక నిరాహార దీక్షకు అన్ని వర్గాల ప్రజలు విశేష మద్దతు తెలపడం ద్వారా ఉద్యమం విజయవంతమైందని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. ప్రజారోగ్యం కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో ఆర్డీఓ శేఖర్ రెడ్డి దీక్ష శిబిరాన్ని సందర్శించి, ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం దృష్టి సారిస్తుందని, 100 పడకల ఆసుపత్రి కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ హామీ మేరకు దీక్షలను విరమించామని సిపిఎం నాయకులు వెల్లడించారు.అయితే ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకపోతే రెండు నెలల తర్వాత దశలవారీగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తైతే సుమారు లక్ష మందికి మెరుగైన వైద్య సేవలు అందే అవకాశముందని, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూరెళ్ళ నరసింహాచారి, కందుల హనుమంతు, గోరిగె సోములు, నాకటి ఉపేందర్, వేముల సైదులు, శానగొండ రాము తదితరులు పాల్గొన్నారు.

## మల్లు స్వరాజ్యం జీవితం నేటి యువతకు ఆదర్శం

● పాలడుగు ప్రభావతి ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు




**నల్గొండ, మార్చి20 (నేటి దర్శిని):**
తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి తెలిపారు. ఆమె నాల్గవ వర్ధంతి సందర్భంగా నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవనంలో ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ, "దున్నేవాడికే భూమి కావాలి", "వెట్టి చాకిరి నిర్మూలించాలి" అనే లక్ష్యాలతో సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధురాలు మల్లు స్వరాజ్యం అని కొనియాడారు. అతి చిన్న వయస్సులోనే (సుమారు 13 ఏళ్ల వయసులో) ఉద్యమాల్లోకి ప్రవేశించి, మహిళల రక్షణ కోసం గెరిల్లా దళాలలో చేరి తుపాకి పట్టిన ధైర్యసాహసాల ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం సమయంలో నాటి సామంత వ్యవస్థ, జాగిర్దారీ విధానాలు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేసి పోరాటాలు నడిపారని తెలిపారు. ఈ ఉద్యమ ఫలితంగా సుమారు 10 లక్షల ఎకరాల భూములు పేదలకు పంచబడగా, వేలాది గ్రామాలు జాగిర్దారుల, దేశముఖుల ఆధీనంలోనుంచి విముక్తి పొందాయని వివరించారు. ఈ పోరాటంలో వేలాది మంది అమరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని గుర్తుచేశారు. ఈ పోరాటాల ఫలితంగానే తెలంగాణలో భూ పంపిణీ జరిగి, పేదలు మరియు మహిళలకు కొంతమేర విముక్తి లభించిందని, ఆ స్ఫూర్తిని నేటి తరాలు కొనసాగించాల్సిన అవసరం ఉందని ప్రభావతి పిలుపునిచ్చారు. ప్రస్తుత కాలంలో కూడా మహిళలు అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పురుషులతో సమాన కూలి అందకపోవడం, కొన్ని ప్రాంతాల్లో ఇంకా వెట్టి చాకిరి కొనసాగడం, పని ప్రదేశాల్లో వేధింపులు, గృహహింస, అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ పరిస్థితుల్లో మహిళలు సంఘటితమై హక్కుల సాధన కోసం పెద్దఎత్తున ఉద్యమాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. యువత ముఖ్యంగా యువతులు, యువకులు సామాజిక న్యాయం కోసం ముందుకు రావాలని, దోపిడీదారుల వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని సూచించారు. మల్లు స్వరాజ్యం వంటి మహనీయుల త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి సమాజ నిర్మాణానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కొండ అనురాధ, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ మేకల వర్ణ, ఐద్వా నాయకులు రమావత్ పార్వతి, లక్ష్మీ, నాగమణి, బబ్బి తదితరులు పాల్గొన్నారు.



# ధురంధర్ -2కు మంచి రెస్పాన్స్

దేశభక్తి అంశాలతో కూడిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' ఓ ట్రెండ్ సెట్ చేసింది. భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ మూవీ సీక్వెల్ 'ధురంధర్ 2' కూడా బాక్సాఫీసు వద్ద దూసుకెళుతోంది. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నటుడు రాకేశ్ బేడీ ఈ విజయంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ రెండు సినిమాల్లో కీలకమైన జమిల్ జమాల్ పాత్ర పోషించిన ఆయన.. తన పెర్ఫామెన్స్‌పై హీరో రణ్‌వీర్ సింగ్ ఇచ్చిన ప్రశంసను గుర్తుచేసుకున్నారు. ఈ చిత్ర బృందమంతా సెట్స్‌లో కలివిడిగా ఉండేది. నా పాత్ర షూటింగ్ పూర్తయిన రోజు.. రణ్‌వీర్ మైక్ తీసుకొని 'ఒకవేళ ఈ మూవీ రూ.1000 కోట్లు వసూలుచేస్తే.. అందులో రూ.500 కోట్లు రాకేశ్ వల్లే వస్తాయి' అని చెప్పారు. ఓ నటుడిగా ఇంతకుమించి ఏం కావాలి?' అని పేర్కొన్నారు. సీనియర్ పొలిటీషియన్‌గా నయవంచక పాత్రలో రాకేశ్ బేడీ అదరగొట్టారు. ముఖ్యంగా 'ధురంధర్ 2'లో ఈ పాత్ర ఇచ్చే ట్విస్ట్ ప్రేక్షకులకు ఓ ట్రీట్. బాలీవుడ్‌లో 47 ఏళ్ల ప్రస్థానం రాకేశ్ బేడీది. 'ధురంధర్' డైరెక్టర్ ఆదిత్యధర్ గతంలో తెరకెక్కించిన మరో హిట్ మూవీ 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్'లోనూ నటించారు. సినీప్రియుల ఆసక్తిని దృష్టిలోపెట్టుకొని 'ధురంధర్ 2'ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసిన సంగతి తెలిసిందే. తొలిరోజే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ప్రపంచవ్యాప్తంగా రూ.172 కోట్లు (గ్రాస్) వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. నెట్ పరంగా రూ.145 కోట్లు అని పేర్కొన్నాయి. ఇందులో దాదాపు రూ.100 కోట్లు హిందీలోనే రావడం గమనార్హం. పెయిడ్ ప్రివ్యూల ద్వారా రూ.40? కోట్లు వచ్చాయని తెలిసింది. నెట్ కలెక్షన్లలో ఫస్ట్‌డే అత్యధిక వసూలు చేసిన బాలీవుడ్ మూవీగా 'ధురంధర్ 2' రికార్డులు నెలకొల్పింది.



# హాట్ హాట్‌గా జబర్దస్త్ వర్ష..

# ఉస్తాద్ భగ్ సింగ్ హిట్ టాక్

## దర్శకుడు హరీష్ శంకర్ ఆనందం




ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా బాగుందన్న అభిప్రాయం రావడం ఎంతో ఆనందాన్నిచ్చిందని దర్శకుడు హరీష్‌శంకర్ అన్నారు. ఆయన దర్శకత్వంలో... పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, రవిశంకర్.వై సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఉగాది సందర్భంగా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'పవన్‌కల్యాణ్ అభిమానులు ఫోన్ చేసి 'అన్నా సినిమా చాలా బాగుంది' అంటున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చేలా సినిమాని మలిచాం. తొలి రోజు నుంచీ ఓ కమర్షియల్ సినిమా తీస్తున్నానని, ఒకప్పటిలా హుషారైన పవన్‌కల్యాణ్ ఇందులో కనిపిస్తారని చెబుతూ వచ్చా. సినిమా చూసినవాళ్లు ఈ సినిమాలో ఇన్ని అంశాలు ఉన్నాయని మాకు తెలియదంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇందులోని ప్రతి పాత్ర బాగా పండింది. అందరికృషితోనే ఇంత మంచి సినిమా చేయగలిగాం అన్నారు. నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ థియేటర్ల దగ్గర పండగ వాతావరణం కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అమెరికా అనే తేడా లేకుండా అన్ని చోట్లా ప్రేక్షకులు సినిమాని ఆస్వాదిస్తున్నారు. మేం ఊహించిన దానికంటే మంచి స్పందన వచ్చింది. పవన్ కల్యాణ్ వన్ మేన్ షో ఇది. హరీశ్‌శంకర్ ఎంతో బాధ్యతగా 'గబ్బర్‌సింగ్' సినిమాని మించేలా తెరకెక్కించారు. కచ్చితంగా భారీ వసూళ్లు సాధిస్తుందీ చిత్రం' అన్నారు. నిర్మాత రవిశంకర్.వై మాట్లాడుతూ 'పెద్ద హీరో నుంచి వాణిజ్య ప్రధానమైన సినిమా వచ్చి చాలా కాలమైంది. ఇందులో కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అంశాలూ ఉన్నాయి. మాకు ఎప్పటికీ గుర్తుండిపోయే ఈ సినిమా విజయంపై మేం సంతోషంగా ఉన్నాం' అన్నారు. ఈ కార్యక్రమంలో కళా దర్శకుడు ఆనంద్‌సాయి, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.



# సర్కే చునార్ తేరి సర్కే పాట వివాదం

## -నోరా ఫతేహిపై ముస్లిం సంస్థ ఫత్వా జారీ




కన్నడ చిత్రం 'కేడీ: ద డెవిల్' లోని 'సర్కే చునార్ తేరి సర్కే' పాట తీవ్ర వివాదాలకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే ఈ పాటలో నటించిన బాలీవుడ్ నటి నోరా ఫతేహీపై అలీగఢ్‌కు చెందిన ముస్లిం పర్సనల్ దారుల్ ఇఫ్తా అనే మతపరమైన సంస్థ ఫత్వా జారీ చేసింది. ఈ పాటలోని సాహిత్యం ఇస్లామిక్ బోధనలకు విరుద్ధంగా ఉందని సదరు సంస్థ పేర్కొంది. ఇటువంటి ప్రదర్శనలు సమాజంలో తప్పుడు సందేశాన్ని పంపుతాయని, ముఖ్యంగా ముస్లిం యువతను తప్పుదోవ పట్టిస్తాయని వారు తమ ఫత్వాలో పేర్కొన్నారు. మరోవైపు ఈ పాటకు దేశవ్యాప్తంగా వస్తున్న నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ పాటపై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో ఈ విషయాన్ని ధృవీకరించారు. మరోవైపు ఈ వివాదంపై నోరా ఫతేహీ స్పందిస్తూ.. ఈ పాట హిందీ వెర్షన్‌లో తనకేమీ సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. మూడేళ్ల క్రితం సంజయ్ దత్ వంటి దిగ్గజ నటుడితో కలిసి నటించే అవకాశం రావడం, అలాగే ఇది 'నాయక్ నహి ఖల్ నాయక్ హూ మై' వంటి ఐకానిక్ సాంగ్ రీమేక్ అని భావించి తాను అంగీకరించానని తెలిపారు. తనకు కన్నడ భాష తెలియదని, మేకర్స్ చెప్పిన అనువాదం అప్పట్లో అభ్యంతరకరంగా అనిపించలేదని ఆమె వివరణ ఇచ్చారు. ధ్రువ సర్జా హీరోగా, ప్రేమ్ దర్శకత్వంలో 1970ల నాటి బెంగళూరు నేపథ్యంతో తెరకెక్కిన 'కేడీ: ద డెవిల్' చిత్రం ఏప్రిల్ 30న విడుదల కానుంది.

# అది బ్రేకింగ్ న్యూస్ కాదు!



అగ్ర కథానాయిక అనుష్క శెట్టి ఓ వ్యాపారవేత్తతో పెళ్లిపీటలెక్కబోతున్నదని గత కొన్ని రోజులుగా సోషల్‌మీడియాలో వార్తలొస్తున్నాయి. తాజాగా వీటిని ఆమె వ్యక్తిగత టీమ్ ఖండించింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఒకరి వ్యక్తిగత జీవితం గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించింది.'అనుష్క శెట్టి వయసుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వార్తల్ని ప్రచారం చేస్తున్నారు. మరి హీరోల వయసు విషయంలో మీలో ఆ ఉత్సాహం ఎందుకు కనిపించడం లేదు?' అని ప్రశ్నించింది. 'తన వ్యక్తిగత జీవితం విషయంలో అనుష్క గోప్యతను పాటిస్తుంది. పెళ్లి అనేది వ్యక్తిగత విషయం. అది బ్రేకింగ్ న్యూస్ ఎంత మాత్రం కాదు. వార్తల్ని ప్రచురించే ముందు నిజానిజాలేమిటో తెలుసుకోం డి' అంటూ అనుష్క టీమ్ పేర్కొన్నది.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365